# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-44 సంచిక - 4 హైదరాబాదు ఏప్రిల్, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 44 Issue - 4 Hyderabad April, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి
ఏప్రిల్ 2024

**Sri Ramana Jyothi**
April 2024

ఈ సంచికలో ...
IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 117వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీ వి. సుబ్రహ్మణియన్** | శ్రీ జి. శ్రీహరి రావు | 10 |
| **3.** | **ఉద్దీపనము** | శ్రీ దుర్గా శ్యామసుందరి | 15 |
| **4.** | **శ్రీ భగవాన్‌తో గ్రిద్దలూరి కుటుంబం అనుబంధం** | శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తి | 23 |
| 5. | *Vyadha Gita:* The Song of the Butcher | Dr K Subrahmanian | 30 |
| 6. | Ashtavakra Gita 23 | V Krithivasan | 36 |
| 7. | Kumbhabhishekam of Mathrubhuteswara Temple | SS Cohen | 40 |
| 8. | The Dawn Chant | Sri Venkataramier | 44 |
| 9. | Anandammal | | 46 |

## Events in Sri Ramana Kendram in April 2024

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 15th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. 28th Dr. KS Jayanthi

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# నామ సంకీర్తన శాంతి సాధకం

డా॥ కే.యస్. గారి 117వ ప్రవచనం

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

మనం ఏ వృత్తి, ఉద్యోగంలో వున్నప్పటికీ, ఏ స్థాయిలో వున్నప్పటికీ, ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా, రోజూ చివర ఆశించేది, రాత్రి సుఖమైన నిద్ర పోవడమే. సరిగా నిద్రించినప్పుడే మనకు గాఢ నిద్ర యొక్క విలువ తెలుస్తుంది. రోజూ సరియైన సమయానికి నిద్రించేవారికి యిబ్బంది వుండకపోవచ్చును కాని, నిద్ర పట్టనప్పుడు మనిషి బెంబేలెత్తిపోతాడు. నిజానికి, మనిషి వరుసగా మూడు రోజుల పాటు అసలు నిద్రించకపోతే పిచ్చివాడి లాగా అవుతాడు. అందుకే కొన్ని దేశాలలో, నిందితుల నుండి సమాచారం రాబట్టడానికి, పోలీసులు, వాళ్ళను ఒకచోట బంధించి, చాలా ప్రకాశవంతమైన లైట్లను ఇరవై నాలుగు గంటలూ వేసి వుంచుతారు. ఆవేదన భరించలేక నిజాలు చెబుతారని వారి ఉద్దేశము.

సరియైన నిద్ర లేనప్పుడు, ఎన్నో స్వప్నాలు వస్తాయి. అలాంటప్పుడు, మంచి నిద్ర పోలేదని అంటాము. మనసు చురుకుగా వుండటం దానికి కారణం. మనకు మామూలుగా కావలసినది శారీరక విశ్రాంతి కాదు. వ్యాపార వృత్తిలో వున్నవారు, రోజులో కొద్దిగా అటూ యిటూ వెళ్ళాల్సినప్పటికీ, శ్రామిక వృత్తులలో వున్నవారికి తాము పడే శారీరక శ్రమ కారణంగా, శరీరం కూడా విశ్రాంతి కోరుతుందన్నది నిజమే.

మనిషి జీవించి వుండడానికి, శ్వాసక్రియ అత్యంత అవసరం. అది నిరంతరం జరిగేది. సాధారణంగా, మనం శ్వాస పీలుస్తూనే వుంటామని గుర్తించం కూడ. శ్వాస సవ్యంగా ఆడనప్పుడే, దాని గురించిన ధ్యాస వస్తుంది. అంటే, మన స్పృహ లేకుండానే, ఆ క్రియ జరిగిపోతూ వుంటుంది. మనం ఎంతసేపు నిద్రించామన్న దానికంటే, ఆ నిద్ర ఎంత గాఢమైనది అన్నది ముఖ్యం. చాలా సమయాల్లో, ఒక ఐదు నిమిషాల పాటైనా సరే గాఢ నిద్ర పడితే ఎంతో హాయిగా వుంటుంది. గాఢ నిద్రలో, యీ ప్రపంచం, మనస్సు, శరీరం ఏవీ వుండవు. మెలకువ వచ్చిన వెంటనే, పై మూడూ కూడా, మళ్ళీ మన దృష్టిలోకి వస్తాయి. ఈ మూడింటిలో ఏది గుర్తుకు రాకున్నా పరిస్థితి ఏమిటి? కొందరు ఇది గొప్ప వేదాంతం అనుకోవచ్చు.

**సామాన్య జ్ఞానం**

మరొక విషయం, మనం నిద్ర పోయేటప్పుడు, మన పేరును బట్టి, నేను ఫలానా వెంకటేశం అని అనుకుంటాము. ఏ విధమైన జ్ఞాపకాలు లేకుండ నిద్రపోయిన మనకు, మెలకువ రాగానే, అన్ని పాత స్మృతులూ, గుర్తుకు వస్తాయి. లేచిన వెంటనే, మన పేరు, మిగతా అన్ని విషయాలు తెలిసివస్తాయి. మనం ఒక పేరుగల వ్యక్తిగా నిద్రపోయి, మెలకువ వచ్చిన తరువాత మరెవరిగానో భావిస్తే ఏమౌతుందో ఊహించవచ్చు.

ఇది వేదాంతం కాదు, సామాన్య జ్ఞానం మాత్రమే. మామూలుగా మనం చిన్న విషయాలను కూడా సంక్లిష్టంగా వున్నట్లు

గుర్తిస్తాం. ఇది సామాన్యుల లక్షణం. వివేకవంతులు, కష్టతరమైన వాటిని సరళం చేసి చూపిస్తారు. ఆదిశంకరాచార్యులు, మరెందరో ఆచార్యవర్యులు అలాగ చేసిన వారే.

నిద్రలో ఏం జరిగింది అని అడిగితే, ఏమీ లేదని అంటాం. కాని, ఏమీ లేనప్పుడు, ఆ ప్రశాంతత ఎలాగ వస్తుంది? మేల్కొని వున్నప్పుడు, రోజంతా, మనస్సు యొక్క సహాయంతో ఎన్నో పనులు చేస్తూ వుంటాం. కాని, అప్పుడు, నిస్పృహ, కోపం, అసూయ, యివన్నీ అనుభవిస్తాం. అప్పుడప్పుడు, సంతోషం కలుగవచ్చు. అయినా, అది కూడా కొద్దిసేపే వుంటుంది. గాఢ నిద్రలో స్పర్ధ అన్నది వుండదు. శాంతి వుంటుంది. మరి మెలకువగా వున్నప్పుడూ, గాఢ నిద్రలో వున్నట్లు శరీర స్పృహ లేకుండా వుండగలగడం ఎలాగ? మెలకువలో వున్నప్పుడు మనం, శరీరంతో మమేక మవుతాం. అలాగ కాకుంటే ఏమౌతుంది? శరీర స్పృహ, మనస్సు, యీ ప్రపంచం, మాయమవుతాయి. అప్పుడు, నిద్రలోలాగ, మానసిక ప్రశాంతత చోటు చేసుకుంటుంది. మెలకువలో వున్నప్పుడు కూడా, శరీరంతో మమేకం కాకుండా వుండడానికి వీలవుతుందా? అదే అసలైన సమస్య. ఈ విషయాన్ని గురించి తెలిపేవే, భగవద్గీత, వేదాలు, ఉపనిషత్తులు. జ్ఞాని ఆ స్థితిలో వుంటాడని భగవద్గీత అంటుంది.

జ్ఞాని దేహంతో మమేకం కాడు. అతడు శుద్ధ చైతన్యం. మన మనసులాంటి మనస్సు, జ్ఞానికి వుండదు.

ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థిత ప్రజ్ఞ స్తదోచ్యతే. తనను అందరి లోనూ, అందరినీ తనలోను వున్నట్లు జ్ఞాని భావిస్తాడు. ఇలాగ అంటున్నప్పుడు, మన శరీరానికి బయట వున్నది, యితరులు అన్నభావం తెలియవస్తుంది. కాని, శరీరం బయట అన్నది, నిజంగా జ్ఞాని దృష్టిలో వుండదు. అయినా, శారీరక ధర్మాలు, ఆహారం తినడం, నీరు త్రాగడం మొదలైనవి జరుగుతూనే వుంటాయి. కాని, అవి సామాన్యుల విషయంలో లాగ కాదు. ఆ చర్యలు తనకు సంబంధం లేని ధోరణిలో సాగుతుంటాయి. మనం అలాంటి జ్ఞానికి, ఎక్కువ ఆహారం యిస్తే అతను సంతోషించడు, యివ్వక పోయినప్పటికీ దుఃఖపడడు.

మెలకువలో వున్నప్పుడూ, నిద్రలో వలె శాంతిని ఎలా పొందాలి అన్న దానిని గురించి, మన ఆచార్యులు కొన్ని పద్ధతులను సూచించారు. కొందరు పూజ, కొందరు జపం, మరికొందరు ధ్యానం మంచిదని సలహాలు యిచ్చారు. వీటికి సత్సంగం ఉపయోగ పడుతుంది. ఇక ప్రాణాయామము, శ్వాస క్రియ నియంత్రణ కూడా పేర్కొనబడ్డాయి. పుస్తకాలు చదవడం, ప్రవచనాలు వినడం కూడా తోడ్పడతాయి. కొన్ని సమయాల్లో, అనుకోకుండా ప్రశాంతత ఏర్పడవచ్చు. అది కూడా, కాస్సేపు మాత్రమే వుంటుంది. గురువు లేదా సాధువు సమక్షంలో, మనం ఆశించకుండానే, మనసులోని కలత పోయి ప్రశాంతత లభిస్తుంది. దానిని వాళ్ళు, మాటల మాధ్యమం లేకుండానే అనుగ్రహిస్తారు. ప్రతి ఒక్కరికీ, ఈ

విషయంలో స్వీయ అనుభవం కలుగుతుంది. అది, కాదని తిరస్కరించలేనిది.

## నామ జపం

ఇక నామ జపం సంగతికి వస్తే, మన పూర్వీకులైన ఋషులు, మునులు, లలితా సహస్ర నామం, విష్ణు సహస్ర నామం, శివ సహస్ర నామం, యిలాగ అనేకం రచించారు. ఈ రచనలు సామాన్యులు చేసినవి కాదు. నామ జపం చేసుకునే భక్తులు, ఏదో తక్కువ రకానికి చెందిన వారని అనుకోవడం పొరబాటు. సాధారణంగా దేవీ, దేవతలకు యిన్ని పేర్లు వుండడం సాధ్యమా? అని కొందరు ప్రశ్నిస్తూ వుంటారు. రాముడో, కృష్ణుడో అంటే సరిపోదా అన్న అనుమానాన్ని వెలిబుచ్చుతూ వుంటారు. ఇది కేవలం బుద్ధిని ఉపయోగించి చేసే విమర్శ.

కాని, ప్రస్తుతం మన సంగతి గమనించినప్పటికీ, యిది సాధ్యమేనని తెలుస్తుంది. బిడ్డ పుట్టినప్పుడు, పుట్టిన ప్రదేశాన్ని బట్టి 13 రోజులు లేదా 30 రోజుల వరకు ఏ పేరును పెట్టరు. నవ శిశువు పేరు లేనటువంటిది. కొన్ని రోజుల తరువాత, రాముడు లేదా కృష్ణుడు అని పేరు పెడతారు. అప్పటి నుండి, ఆ పేరుతో పిలుస్తారు. అప్పుడు, ఆ బిడ్డ, శరీరం కాదు, మనస్సు కాదు. కాని, ఆ పేరుకు స్పందిస్తుంది.

నిజానికి, మనం ఎన్నో పేర్లతో పిలిచినప్పుడు కూడా జవాబిస్తాం. ఉదాహరణకు, బంధుత్వాన్ని బట్టి, నేను ఫలానా వ్యక్తి

యొక్క తండ్రినని, కొందరికి మేనల్లుడినని, కొందరికి సోదరుడినని, భర్త లేదా మామయ్య, యిలాగ ఎన్నైనా చెప్పవచ్చు. అలాగే వృత్తిని బట్టి, దానికి తగినట్లు 'ఉపాధ్యాయుడు' వగైరాలు చేరవచ్చు. ఇవన్నీ ఒకే వ్యక్తికి ఆపాదించిన పేర్లు. అన్నింటికీ మనం స్పందిస్తాం, పలుకుతాం. ఇవన్నీ ప్రతి రోజూ జరుగుతూనే వుంటాయి.

## మొదలు, చివర పేరే లేదు

ఇక రెండవది, మనం ప్రతి రోజూ గమనించేది. వ్యక్తి చనిపోయి నప్పుడు, వెంటనే యింట్లోని వ్యక్తులు, శవానికి దగ్గరగా వున్న వ్యక్తులు, స్నేహితులు అందరూ కూడా, శరీరాన్ని లేదా శవాన్ని తీసివేయండి అని అంటారు. కాని, పేరు పెట్టి ఫలానా వ్యక్తిని తీసివేయండి అని అనరు. వ్యక్తి మరణించాక పేరుతో పిలవరు. మరో విధంగా చెప్పాలంటే, నవజాత శిశువుకు, మృత శరీరానికి భేదం లేదు. అప్పటి వరకు జీవితంలో, ఒక పేరు లేదా పేర్లతో పిలవబడిన వ్యక్తి యొక్క శరీరానికి, ఏ పేరూ వుండదు.

సాధారణ మానవుడే అన్ని పేర్లకు ప్రతిస్పందిస్తున్నప్పుడు, ఏ పేరుతో పిలిచినా పలకడానికి సృష్టికర్తకు కష్టమా? వ్యక్తి అనుసరించే మత సంబంధమైన నమ్మకాన్ని బట్టి 'రామ్' అనినా, 'అల్లాహ్' అనినా, 'జీసస్ క్రైస్ట్' అనినా ఏ ఇబ్బందీ వుండదు. ఏ ఒక్క పేరుతో నైనా నామజపం చేసినప్పుడు, అది పేరు మాత్రమే కాదు, భక్తి ప్రేరిత ప్రకంపనాలుగా మారుతుంది. అవి మనసును స్థిరంగా వుండేలాగ చేస్తాయి. మనకు కావాల్సినది అదే. శాంతి, నెమ్మదిలతో

కూడిన మనస్సు మాత్రమే. భక్తి, శ్రద్ధలతో చేసిన నామ జపం దానిని ప్రసాదిస్తుంది.

మన పూర్వీకులు ఎంతో ఆలోచించి, ఈ నామ స్మరణా పద్ధతిని మనకు ఉపయోగకరమని నిర్ణయించారు. ఇతర పద్ధతుల కంటే, యిది తక్కువదని కొందరు అనుకోవచ్చు. అది నిజం కాదు. నామ స్మరణ లేదా భజన కార్యక్రమంలో పాల్గొనినా, లేదా వాటిని గమనించినా, ఒక విషయం అర్థమవుతుంది. ఈ కార్యక్రమాన్ని మొదట భక్తులు మంద్ర స్థాయిలో, నెమ్మదిగా మొదలుపెట్టి, క్రమంగా పెద్దగా వేగాన్ని పెంచుతూ పోతారు. అలాగ కొంతసేపు కానిచ్చి, మళ్ళీ నెమ్మదిగా తగ్గించి, తిరిగి స్వరాన్నీ, వేగాన్నీ పెంచుతారు. అది తారా స్థాయికి చేరేటప్పటికి, కొందరు భక్తులు మేనును ఎరుగకుండ, అనుభవంలో మునిగిపోతారు. మరికొందరు భక్తులు, కార్యక్రమం ముగించిన తరువాత కొంతసేపు అలాగే కూర్చొని, ఆ హాయిని మనసారా ఆస్వాదిస్తారు.

అందుకే మన పూర్వీకులు, ఈ పద్ధతి, యితర పూజా, జపం లాంటి కార్యక్రమాలకు ఏ విధంగానూ తీసిపోదని తెలియజేశారు. ఏ నామాన్ని జపిస్తున్నామనే ప్రశ్నకు తావే లేదు. శ్రద్ధ, భక్తి ప్రధానం.

లలితా సహస్రం, శివ సహస్ర నామం మొదలైన నామావళి పఠనం, సాకార రూపంలో దేవీ దేవతా మూర్తులను మొదట ఆరాధిస్తూ, క్రమంగా నిరాకార రూపంలో ధ్యానించడానికి సహాయ పడుతుంది. యిలాంటి అన్ని కార్యక్రమాలలో కూడా, భక్తితో బాటు, సంపూర్ణ అంకితభావం కలిగి వుండడం ప్రధానం.

# శ్రీ వి. సుబ్రహ్మణియన్

(1939-2022)

జి. శ్రీహరి రావు

('మణి' గారుగా ప్రసిద్ధికెక్కిన శ్రీ సుబ్రహ్మణియన్ గారు, శ్రీ రమణాశ్రమ సర్వాధికారీ, శ్రీ భగవాన్ సోదరుడూ అయిన శ్రీ నిరంజనానంద స్వామి గారి మనుమడు. రెండవ ఆశ్రమ ప్రెసిడెంటుగా వ్యవహరించి ఆశ్రమాన్ని ఎంతో అభివృద్ధి చేసిన శ్రీ టి.ఎన్. వెంకటరామన్ గారి మూడవ పుత్ర సంతానము. మితభాషి, సౌమ్య స్వభావులైన శ్రీ మణిగారు, శ్రీ రమణాశ్రమమునకు విశేష మయిన సేవలందించారు.

1985 నుండి, అనేక రంగాలలో సేవలందించిన శ్రీ మణిగారు, ఆశ్రమ యాజమాన్యములో శ్రీ రమణాశ్రమ అధ్యక్షులకు కుడిచేయిగా వ్యవహరిస్తూ వచ్చారు.

ఆశ్రమ కార్యనిర్వహణా బాధ్యతలే కాక, శ్రీ మణిగారు చెట్ల పెంపకము, తోట పనులలో ఎంతో ఆసక్తి కనపరిచేవారు. దగ్గర వున్న గ్రామములో, శ్రీ రమణాశ్రమమునకు చెందిన పొలములో ఎన్నో రకాల కూరగాయలు, పండ్లు పండించి ఆశ్రమ అవసరాలకు వినియోగించేవారు. ఆశ్రమ గోశాలను కూడా వీరు ఎంతో అభివృద్ధి చేసి, ఆశ్రమ వంటశాలకు వలసిన పాలను సరఫరా చేసేవారు. ఆశ్రమ యాజమాన్యమునకు అనేక విధములుగా వీరి సలహాలు, సహాయము ఎల్లప్పుడూ అందుతుండేవి.

శ్రీ రమణాశ్రమ ప్రచురణ Arunaachala Ramana - Eternal Ocean of Grace, 2018 లో ఏడు భాగములుగా

వెలువడింది. మూడవ భాగమయిన స్మృతులలో, శ్రీ మణిగారి స్మృతులు ముద్రింపబడ్డాయి. వారి మితభాషిత్వానికి తగ్గట్లుగ, వారి స్మృతులు కూడా చాలా క్లుప్తమయినవి).

మా తల్లితండ్రులకు తిరువణ్ణామలలో పుట్టిన, మొదటి పుత్ర సంతానాన్ని నేను. నా యిద్దరు అన్నగార్లూ, దక్షిణ తమిళనాడులో జన్మించారు. ఆ రోజులలో, మేము అరుణాచలేశ్వరుని ఆలయానికి గురుక్కులలో ఒకరైన, సంతానం గారింట్లో అద్దెకుండే వాళ్లము. ఆ యిల్లు, గుడికి ఉత్తర గోపురము సమీపములో వున్న అవరన్ కుట్టు వీధిలో వుండేది. ఆశ్చర్యం! ఆ యిల్లు 60 సంవత్సరాల క్రితం ఎలా వుండేదో, యిప్పుడూ అలాగే వున్నది. మేము ప్రస్తుతము వుంటున్న యింటికి 1948లో మారాము. చిన్నప్పుడు, మా సెలవులలో, ఖాళీ సమయాలలో, ఆశ్రమంలోనే వుండేవాళ్లము. కొన్నిసార్లు, టౌన్ నుండి ఆశ్రమానికి వచ్చేటప్పుడు, స్కందాశ్రమానికి, విరూపాక్ష గుహకు వెళ్లి వచ్చేవాళ్లము.

ఏభై సంవత్సరాలు గడిచిపోయినా, యిప్పటికీ, నిర్మలమైన ప్రశాంత వదనంతో సోఫాలో ఆనుకుని కూర్చొని వుండే శ్రీ భగవాన్ నాకు గుర్తుకు వస్తారు. కొన్నిసార్లు, రాత్రిపూట మేము నిరంజనానంద స్వామివారి వద్ద వుండిపోయి, పాతహాలుకు ఎదురుగా వున్న ఆఫీసు గదిలో నిదురపోయేవాళ్లము. తెల్లవారుఝామున వేదపారాయణతో నాకు మెలుకువ వచ్చేది. పద్మాసనంలో కూర్చొని, ఆత్మావసిష్ఠులై, సుదీర్ఘంగా శూన్యంలోకి చూస్తున్నట్లు వుండే శ్రీ భగవానునూ, ఆ ప్రశాంత వాతావరణాన్నీ, నేనెప్పటికీ మరచిపోలేను. శ్రీ భగవాన్

అంత సహజంగా వుండే వేరెవరినీ మనము ఊహించలేము. ఆధ్యాత్మిక ఔన్నత్యం కలిగిన వ్యక్తులెవరిని చూసినా, మనకు గౌరవంతో పాటు, ఒకరకమైన అబ్బురపాటు కలగడం సహజం. శ్రీ భగవాన్ విషయంలో, గౌరవభావమే కలిగేది కానీ, ఎట్టి భయము వుండేది కాదు. వేదపాఠశాల ప్రక్కన, మేము పిల్లలము ఆడుకునే వాళ్లము. శ్రీ భగవాన్ అటువైపు నుండే నడిచి వెళ్ళేవారు. వారు వెళ్ళేదాకా మేము ఆట ఆపేవాళ్ళము కానీ, మాకేమీ జంకు వుండేది కాదు.

నేను నాల్గవ తరగతిలో వున్నప్పుడు, మా తరగతి ఉపాధ్యాయుడు గారు, శ్రీ భగవాన్ బోధ గురించి ఒక నాటిక రూపొందించారు. ఈ నాటికను మేము భగవాన్ సమక్షంలో ప్రదర్శించాము. నాటికలో నా పాత్రకు సంబంధించిన సంభాషణను విన్న శ్రీ భగవాన్, "మణి, మణిలాగానే మాట్లాడుతున్నాడు", అన్నారు. నాకు ఆరేళ్ళ వయస్సు వున్నప్పుడు, శ్రీ భగవాన్, ఆశ్రమం వెనుక మెట్లుదిగుతూ పడిపోయారు. భుజము ఎముక విరిగింది. వారి పరిచారకులను, విధులను సరిగ్గా నిర్వర్తించలేదని నేను కోప్పడ్డాను. ఆ చిన్న వయస్సులో నేను మాట్లాడిన తీరును చూసి శ్రీ భగవాన్ అబ్బురపడ్డారు. ముక్కు మీద వేలు వేసుకుని "మణి చలాకీ పిల్లవాడు. ఎంత చక్కగా మాట్లాడుతున్నాడు!", అన్నారు.

శ్రీ నిరంజనానంద స్వామి, మధ్యాహ్న భోజన సమయంలో మమ్ములనందరినీ దగ్గర కూర్చోపెట్టుకునేవారు. వారి కఠిన ప్రవర్తన గురించి భక్తులు తప్పు పట్టేవారు కానీ, నాకు మాత్రము, ఆశ్రమ

నిర్వహణ అంతా శ్రీ భగవాన్ సంకల్పము వల్లనే జరుగుతున్నదనీ, నిరంజనానంద స్వామి కేవలము శ్రీ భగవాన్ పనిముట్టు మాత్రమే ననీ అనిపించేది. ఆశ్రమ బాధ్యతలను నిర్వహిస్తున్న నాకు, యీ పని ఎంత కష్టమో పూర్తిగా అవగతమయినది. అయితే, మేము ఏది చేసినా, కర్త మాత్రము శ్రీ భగవానే అనేది సుస్పష్టము.

శ్రీ భగవాన్‌కు శస్త్ర చికిత్స చేసిన డా. రాఘవాచారి గారిని నేను 1988లో కలుసుకున్నప్పుడు, శ్రీ భగవాన్ గురించి వారి అభిప్రాయము తెలుపమని కోరాను. వారిలా అన్నారు. “మణీ! నేను బండబారిపోయిన శస్త్రవైద్యుణ్ణి. ఎన్నో శస్త్ర చికిత్సలు చేశాను. రోగి నొప్పి గురించీ, అతను పడే బాధ గురించీ నాకు పూర్తిగా అవగాహన వున్నది. కానీ శ్రీ భగవాన్, తన బాధను సహించిన రీతిని నేను మరచిపోలేను. నాలుగవ శస్త్ర చికిత్స చేయునప్పుడు, మొత్తము దేహానికి మత్తుమందు యిస్తామంటే, శ్రీ భగవాన్ ఒప్పు కోలేదు. చేతి భాగానికి మాత్రము స్థానికంగా యివ్వటానికి ఒప్పు కున్నారు. శస్త్ర చికిత్స చేయు భాగంలో, వేడిని పుట్టించు కత్తులు వాడాము. తీసివేయాల్సిన భాగాన్నంతా తీసివేస్తున్నప్పుడు, తనకేమీ పట్టనట్లు కూర్చున్నారు శ్రీ భగవాన్. వారి వదనంలో సంపూర్ణ మయిన శాంతి, ప్రశాంతత నెలకొని వున్నాయి. అది నేనెప్పటికీ మరచిపోలేను”.

ఆపరేషన్ తరువాత, వారిని చూడడానికి నేనూ వెళ్లాను. ఒక కుర్చీలో, దిండ్ల సహాయంతో కూర్చుని వున్నారు. ఆ సమయంలో కూడా, వారిలో ప్రతిఫలించిన దివ్యానందము, నిర్మల ప్రశాంతత

నాకు బాగా గుర్తున్నాయి. ఆశ్రమ పరిసరాలలో శాంతి భద్రతలు కాపాడటానికి, కొంతమంది పోలీసులను నియమించారు. వారిలో ఒకతను పూర్తి నాస్తికుడు. సాధువులనూ, సన్యాసులనూ నిరసిస్తూ వుండేవాడు. అతనికి ప్రత్యేకంగా ఆశ్రమ సంరక్షణ బాధ్యతలను అప్పగించారు. ఆశ్రమ ప్రాంగణం లోపలికి వచ్చేటప్పుడు తన బూట్లు తీసివేయమన్నారని తిట్టుకునేవాడు. కానీ ఒక్కసారి శ్రీ భగవాన్ దివ్య ముఖారవిందాన్ని చూడగానే, అతని వైఖరి పూర్తిగా మారిపోయింది. శ్రీ భగవాన్‌కు పరమ భక్తుడైపోయాడు. అనేక సంవత్సరాల తరువాత, నేను కూర్గులో వున్నప్పుడు, అతని భార్య కన్నీటితో యీ విషయం నాకు తెలియపరిచింది.

నా నాల్గవ దశకం మధ్యలో వున్నప్పుడు, నాకు భార్య, ఎదుగుతున్న యిద్దరు పిల్లల బాధ్యతలున్న సమయంలో, ఆశ్రమానికి శాశ్వతంగా వచ్చేసి తనకు సహాయకారిగా వుండమని, నా అన్నగారు కోరారు. నేను కొంచెము సందేహించాను. కానీ నా తల్లిగారు, వృద్ధాప్యము వచ్చిన తరువాత శ్రీ భగవాన్‌కు సేవ చేస్తాననుకోవడం నిరర్థకమనీ, సంపూర్ణమయిన ఆరోగ్యంతో వుండి, పని పాటలు చేయగలిగినప్పుడే వారి సేవ చేయాలనీ నిర్దేశించారు. ఆ ఆదేశముతో, నా భవిష్యత్తును గురించిన నిర్ణయం జరిగి పోయింది. స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని, ఆశ్రమానికి వచ్చి, నా అన్నగారికి సహాయకారిగా వుండిపోయాను.

******

# ఉద్దీపనము

(మార్చి సంచిక తరువాయి) శ్రీదుర్గా శ్యామసుందరి

సాధారణ మనిషి, తన కోరికలతో చాలా బంధం కలిగి వుంటాడు. తన సంకల్ప శక్తితోనో, భగవంతుడిని ప్రార్థించి కాని, కోరికలను తీర్చుకుంటాడు. కాని జ్ఞాని, నిష్కామంగా, హృదయంలో ప్రపంచాన్ని జయించి వుంటాడు కనుక, అతను ఒకసారి ఏదైనా కోరితే, భగవంతుడు తప్పక నెరవేరుస్తాడు. ఇది ఎప్పుడు సాధ్య మౌతుంది? హృదయం నిండా భగవంతుడిని నింపుకుని ఆయన మీదనే ఆధారపడినప్పుడు మాత్రమే. జ్ఞాని, తన వ్యక్తిత్వాన్ని కోల్పోయి, తన ద్వారా ఆ అనంతమైన శక్తి పనిచేసేటట్లు వున్నాడు కాబట్టి, అతని ఆలోచన, కోరిక, మాట, ప్రార్థన ఏవైనా వెంటనే నెరవేరుతాయి. భగవంతుడిని, "నా అహంకారము పోగొట్టి మిథ్యా నేను నుండి విముక్తి కల్గించ" మని ప్రార్థించినప్పుడే ఆ ప్రార్థనకు సమాధానం దొరుకుతుంది. ఆ ప్రార్థన, ధ్యానమంత లోతుగా, నిజాయితీగా జరగాలి.

'నేను' అనే పదం నాలో ఉచ్చరింపబడుతోంది. అదొక్కటే సత్యం. మిగిలినదంతా మిథ్యే. 'నేను' అందరిలో వున్నాను. కాని అందరికీ ఆ విషయం తెలియడం లేదు. వాళ్ళు, శరీరము, బుద్ధి, కోరిక అనేవాటిని పట్టుకుంటున్నారు. వారికి, చైతన్యానికి మధ్య అవి అడ్డుగోడలుగా వున్నాయి. 'నేను వున్నాను' అన్నదే విశ్వాధార మైన సత్యము, వాస్తవము. నా శరీరము నాకు ఒక పనికిరాని పెంకు వలె తోస్తోంది. అంతేకాదు, యితరుల శరీరాలు కూడా

అలానే తోస్తున్నాయి. అన్ని బంధాల నుండి, కోరికల నుండి విముక్తి పొంది, నేను ఒక పక్షిలాగా స్వేచ్ఛగా వున్నాను. నేను శరీరాన్ని కాదు అన్న భావన ఎంత బలంగా వున్నదంటే, నాకు చావు లేదని ధృడంగా అనిపిస్తోంది. నిజమైన నేను దైవమే. అది నిత్యము, సత్యము. యింతకు పూర్వము, అప్పుడప్పుడు అనారోగ్యంతో బాధపడేవాడిని. ఇప్పుడు పరిపూర్ణ ఆరోగ్యంతో, ఉత్సాహంగా వున్నాను. 'నేను' ఉనికిపై ఎఱుక అలానే వున్నది. పగటి సమయాల్లో ఆ ఎఱుక ప్రతిక్షణం నిండి వుండేది. రాత్రి సమయాల్లో, నిద్ర, మెలకువ రెండూ తెలుస్తూనే వున్నాయి. నాలుగు గంటల నిద్ర సరిపోయేది. నిజానికి అంత గాఢంగా నిద్ర పోయే వాడిని కూడా కాదు. 'అసలునేను', నిద్ర పోతున్నా, ఎఱుకలోనే వుండేది.

నా హృదయాంతరాళాలలో కాలాతీత స్థితిని అనుభవిస్తున్న ప్పటికీ, ఉపరితలంలో, గడుస్తూ వున్న కాల గమనాన్ని తెలుసుకో గల్గుతున్నాను. ఈ రెండు అనుభవాలు ప్రక్క ప్రక్కనే నడుస్తున్నాయి. నా హృదయపు లోతులలో, నిరంతర వర్తమానంలో జీవిస్తున్నాను. పూర్తి సంతృప్తితో వున్నాను. ఇంకా ఎక్కువ సంతోషం కోసం భవిష్యత్తులోకి ఎదురు చూపులు లేవు. ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్నా, మంచి సంగీతాన్ని ఆస్వాదిస్తున్నా, లేక నిస్సారమయిన పనేదైనా చేస్తున్నా, నా సంతోషంలో ఏ మార్పు లేదు. వర్తమాన క్షణంలో, నేను పూర్ణంగా, ఉత్సాహంగా జీవిస్తున్నాను. గతం లేదు, భవిష్యత్తూ లేదు. రెండూ వర్తమానంలోనే వున్నాయి. ఈ వర్తమానం, కాలాన్ని గురించి తెలియజేసే 'ఇప్పుడు' కాదు. కాలాతీతమయిన, కదలిక లేని నిశ్చలత.

అందులోకే, వస్తువులు, సంఘటనలు, ప్రజలు వస్తున్నారు, పోతున్నారు. అసలు కాలగమనమే భ్రమ. అహంకారంలో కలిగే మార్పులకు, చైతన్యానికి అసలు సంబంధం లేదు. దానిలో మార్పు వుండదు. గతంలోకి చూస్తే, యిన్ని సంవత్సరములు కూడా, శాశ్వత మైన వర్తమానం (now) లోనే వున్నాయి. అప్పటి నుండి ఏమీ మార్పు లేనట్లే వున్నది. కాలం గురించి నా అనుభవం ఎలా ఉన్నదో, దేశానికి సంబంధించినది కూడా అలానే వున్నది. భారత దేశవే నా ఆధ్యాత్మిక నెలవు అనుకునే వాడిని. కాని మొట్టమొదటిసారిగా, భారతదేశమునకు వెళ్ళాలన్న తీవ్రమయిన కోరిక మాయమయింది.

కాంతిలో భయం లేదు. ఎటువంటి వైరుధ్యము లేదు. ప్రకృతి, భగవంతునితో మనస్ఫూర్తిగా కలిసి పనిచేస్తోంది. నా హృదయంలో హల్లలూయా బృందగానం వినిపిస్తోంది. సర్వ శక్తిమంతుడైన భగవంతుడే ఎల్లవేళలా పరిపాలిస్తున్నాడు. ఆయన శక్తి తీవ్రంగా, నా ఉనికి అంతా వ్యాపించింది. ఆయన ఎప్పుడూ ప్రేమగా వున్నాడు, ఆనందంగా వున్నాడు. నా సహచరుల అంతరాళాలలో ఆయనే వున్నాడు నిశ్శబ్దంగా, ప్రశాంతంగాను. కాని, ఈ విషయం వారికెవ్వరికీ తెలియదు. నాకు, అందరికీ యిలా చెప్పాలని అనిపించింది. సోదరులారా! భయపడకండి. మనం దైవంలోనే వున్నాము. మనమే దైవము. ఆయన వద్ద శాంతి, బలము, ప్రేమ వున్నాయి. ధైర్యంగా వుండండి. ఆయనను తెలుసుకోవటం, ఆయన సన్నిధిని గూర్చి ఎఱుకలో వుండటం, ఆయన కౌగిలిలో ప్రేమగా,

శాంతిగా వుండిపోవటం, మీ జన్మహక్కు. మీ బాధలన్నీ తీరిపోతాయి. మీ స్వరూపం ఆనందమే. ఒకరోజు, అది మీకు తప్పక తెలుస్తుంది. ఇది తప్పించుకోలేని నియమం.

నా పరిచయస్తులతో నా సంబంధంలో గొప్ప మార్పు వచ్చింది. వారెవ్వరో రావాలని కాని, వారి ప్రేమను పొందాలన్న ఆలోచన కానీ  లేదు. స్వతంత్రంగా వుండగల్గుతున్నాను. స్నేహితులను, వారిపై మమకారం లేకుండా ప్రేమించగల్గుతున్నాను. 'నాది' అన్న భావనలేదు. అర్థం లేని కోరికలు లేవు. మనుష్యుల పట్ల స్వచ్ఛమైన ప్రేమ వున్నది కాని, బంధం లేదు. నా సంతోషం కోసం ఎవరిమీద ఆధారపడటం లేదు. హృదయంలో ఏర్పడిన కుదురు వలన సంతోషం కలుగుతుంది కాని, ఎదుటి వారిని ప్రేమించటం లేక ప్రేమను పొందటం వల్ల సంతోషం రాదు.  హృదయంలోని సంతులనత వల్ల ప్రేమ బహిర్గతమౌతుంది. అనంతుడైన పరమాత్మ మనల్ని అనంతంగా ప్రేమిస్తున్నాడు. ఆయనతో అనుసంధానమైతే, మన సంబంధ బాంధవ్యాలలో ప్రేమ నిండుతుంది. మనం బయట చూచే ప్రేమ, అసలు ప్రేమకు వక్రీకరింపబడిన ప్రతిధ్వని.

ఆధ్యాత్మిక జీవనంలో, మనుష్యుల మీద ప్రేమాభిమానాలు పోగొట్టుకోవాలేమోనని భయపడతారు. కాని, భగవంతుడు మన ద్వారా బహిర్గతమైతే, అందరినీ ప్రేమించగల్గుతాము. ఒకసారి జ్ఞానోదయం కలిగితే, అన్ని సుగుణాలు అవే వస్తాయి. అసలు 'నేనే' ప్రేమ.

నాలో అన్ని భయాలు తొలగిపోయాయి. నా అనుభవాలన్నీ ఒక పద్ధతిలో అమర్చబడుతున్నాయి. ప్రపంచమంతా కాంతివంతం గా వున్నది. నిద్ర, మెలకువల మధ్య స్థితిలో ఒక దివ్యానుబంధం కలిగింది. ఈ విశ్వమంతా ఒక నిరంతర చలనంలో వున్నది. దీని వెనుక ఒక చోదక శక్తి వున్నది. ఈ విశ్వంలో ప్రతి ఒక్కటి వేరొక దానితో సంబంధం కలిగి, మొత్తమంతా ఏకంగా కలిసి వున్నది. అందులో నేనొకడిని. ఒక అద్భుతమైన ప్రణాళిక ప్రకారం అన్నీ జరుగుతున్నాయి. గతంలోని నా అనుభవాలన్నీ ఆ ప్రణాళికలో భాగమే. ప్రతి ఘటనకు, ప్రతి మాటకు, ఒక ఉద్దేశము, అర్థము వున్నాయి. అంతేకాదు, అందరి ఆలోచనలు, భావనలు, క్రియలు అన్నీ అందులో భాగమే. ప్రపంచ వ్యవహారాలలో కన్పించే చిక్కు ప్రశ్నలకు, అంతర్గతంగా ఒక పరిపూర్ణ ప్రశాంతత వున్నది. చిక్కు ప్రశ్నల భాగాలన్నింటినీ సరియైన స్థానాలలో ఉంచితే ఒక పొందికైన క్రమం ఏర్పడుతుంది.

ఈ ప్రపంచము, అందులోని ప్రతి ఒక్కరూ కూడా విశ్వ మనస్సు యొక్క ఆధీనంలో వున్నారు. వారి ప్రతి పని, ప్రతి మాట కూడా విశ్వ ప్రణాళికలో బద్ధమై వున్నది. మన వ్యక్తిగతమైన ఇచ్ఛ కూడా ఆ పరిధిలోనిదే. పురుష ప్రయత్నమే చాలా ముఖ్యమైనది, దానిని మించినది లేదు అనే వ్యక్తిగాని, భగవన్నిర్ణయమే అన్నింటినీ నడిపిస్తుంది, మనం చేసేదేమీ లేదు అనే వ్యక్తి కానీ, ఇద్దరూ చెప్పేది కొంత ఒప్పు, కొంత తప్పు. ఇవి రెండూ సమాంతరమైన సిద్ధాంతాలు కావు. అసలైన విషయమేమిటంటే, ఒక పెద్ద వృత్తంలో

చిన్న వృత్తం వున్నది. అత్యున్నతమైన ఆ శక్తి ఒక్కటే సృష్టి నడకకు కారణము.

ఒక వ్యక్తి ఏదైనా చేయాలని నిర్ణయించుకోవటము, అతని ప్రయత్నము, అన్నీ విశ్వ ప్రణాళికలోనే వున్నాయి. అది ఎంత విశాలమైనదంటే, అందులో అన్నీ యిమిడిపోతాయి. మనిషికి తానేమైనా అనుకునే స్వేచ్ఛ వున్నది. కాని అది కూడా ముందే నిర్ణయింపబడే వున్నది. మొదటిది రెండవదానిలోనే వున్నది, అంటే ఒక పెద్ద వృత్తంలో చిన్న వృత్తం వున్నట్లు. భారతీయులు అనుకున్నట్లు అంతా విధి నిర్ణయం అనుకున్నా పాశ్చాత్యుల ఆలోచన ప్రకారం వ్యక్తిగత ప్రయత్నం ముఖ్యం అనుకున్నా - ఆ విశ్వ మనస్సు వైఖరియే వారి ద్వారా బహిర్గతమౌతున్నది. ఆ ప్రణాళిక వీరిని ఆ విధంగా ఉపయోగించుకుంటున్నది. మంచివారు - చెడ్డవారు, విశ్వాసులు - నాస్తికులు, జ్ఞానులు - అజ్ఞానులు, అందరూ విధి నిర్ణయంలోని వారే. అందరిలో ఆత్మోన్నతి జరుగుతున్నది. ఇదే నియమం.

జ్ఞానుల దృష్టిలో, ప్రతి ఘటనా, చిన్నదికాని, పెద్దదికాని, చిన్న వస్తువునుండి, పరిభ్రమిస్తూన్న భూగోళం వరకూ, అన్నీ, విశ్వ నియమం ప్రకారం జరుగుతున్నాయి. సృష్టికర్త నిర్ణయం లేనిదే ఏదీ జరగదు. జ్ఞానోదయం ద్వారా నాకు కల్గిన అనుభవాలన్నీ ఎవరికైనా బోధించాలనో, ఉపదేశం ద్వారా ఎవరినైనా మేల్కొల్పా లనో కోరిక లేదు. సాక్షిగా నా దినచర్య కొనసాగిస్తున్నాను. అన్నీ దైవ నిర్ణయం ప్రకారం జరుగుతున్నాయి. అన్నీ, వాటి వాటి స్థానా

లలో సజావుగా జరిగిపోతున్నాయని అర్థమయిన తరువాత, ఎవరికో ఉపదేశించి, మార్పు తేవాలన్న కోరిక ఎందుకుంటుంది? ఒక వ్యక్తి, ఏ సమయంలో, ఏ ప్రదేశంలో వుండాలో అక్కడే వుంటున్నాడు, అతనికి ఇష్టం వున్నా, లేకున్నా. ప్రదేశం అంటే భౌతికమైనదే కాదు. అతని సంబంధాలు, చుట్టూ వుండే వాతావరణము, మానసిక స్థితి అన్నీ. ప్రతి జీవి, వ్యక్తి, ఘటన అన్నీ ప్రణాళిక ప్రకారం ఎలా ఉండాలో అలాగే జరుగుతోంది - అంతా సహజంగా, ఇతరుల జోక్యం అవసరమే లేదు.

స్వేచ్ఛ అనేది భ్రమ. భగవద్గీతలో అర్జునునికి శ్రీకృష్ణుడు అనుగ్రహించిన విశ్వరూప వర్ణనమే అసలైన స్థితి. భగవంతుడు చోదక శక్తిగా, ఈ ప్రపంచ భ్రమణం జరుగుతోంది. ప్రతీ వ్యక్తి, అనేక జన్మల పరంపరలో ఈ భ్రమణంలో వున్నాడు. అతని వ్యక్తిగత స్వేచ్ఛ ఒక ఉత్తమమైన సత్యంలోనే యిమిడి వున్నది. భగవద్గీతలో భగవానుని సందేశం అదే. అన్నింటికీ కర్త ఆయనే. ఆయన ఆడించే నాటకంలో మనం పాత్రధారులం మాత్రమే. యుద్ధరంగంలో ఎవరి చేత ఎవరు చంపబడతారో, భగవంతుని ప్రణాళికలో నిర్ణయింప బడే వున్నది. మహమ్మద్ ప్రవక్త, నిరంతరం భగవంతుని శరణు జొచ్చుమని ఎందుకు చెప్పాడో నాకు యిప్పుడు అర్థమయింది.

జీవిత నాటకానికి రచయిత భగవంతుడే. అందులో మనందరిదీ ఒక్కొక్క పాత్ర. ఆ పాత్రకు తగ్గట్లు మనం నటించాలి. ఆ పాత్ర నచ్చలేదు అని యింకొక పాత్ర నటించటానికి స్వేచ్ఛ లేదు. ఎందుకంటే, యింతకు ముందు జరిగిన దాని ప్రకారం,

యిప్పటి పాత్ర ఆధారపడి వుంటుంది. నేను కూడా అందరి నటులలో ఒకడినే. అయినప్పటికీ, దీనికంతటికీ సాక్షిగా కూడా వున్నాను. నా కంటే భిన్నంగా వున్న నా అహంకారం, ఒక తోలు బొమ్మలాగా ఆడటం గమనిస్తున్నాను. ఇతరులందరూ కూడా తోలు బొమ్మల వలె నాకు తోస్తున్నారు. అయినా వారికి ఒక ఉన్నతమైన శక్తి ఆడిస్తున్నట్లు తెలియడం లేదు. అంతా విధి నిర్ణయమే. పురుష ప్రయత్నం కూడా బాహ్యంగా కన్పించే కారణం మాత్రమే. అది కూడా ముందే నిర్ణయింపబడింది. ఇది చెడు, ఇది మంచి అనేవి లేవు. అన్నీ మంచికే జరుగుతున్నాయి. పైకి పొరబాటుగా కనిపించేవి కూడా ఎన్నో గొలుసు చర్యలలో, చివరకు మంచి ఫలితాన్నిచ్చి, ఎంతో మంది జీవితాలను ప్రభావితం చేయవచ్చు.

ఈ కార్య కారణ గొలుసు నా మనస్సుకు హత్తుకుంది. ప్రతీ చిన్న విషయము ఈ సాలెగూడులోని భాగమే. దాని ఫలితం కూడా మొత్తం గూడును వ్యాపిస్తుంది. మన ప్రవర్తన, మన దగ్గర వారిలోనే కాక, ఎక్కడో దూరంగా మనకు సంబంధం లేనివారిని కూడా ప్రభావితం చేస్తుంది. మనిషికి - ప్రకృతికీ, మనిషికి - మనిషికీ అదృశ్యమైన సంబంధాలు వున్నాయి. అనంతమైన ఈ అమరికలో నేను ఒక భాగమనే భావన బలంగా వున్నది. ఇందులో నా పాత్రను నేను సమర్ధవంతంగా పోషించటమే నేను చేయవలసినది. నా వ్యక్తిగత అభిప్రాయాల్ని త్రోసిపుచ్చాలి. నూతన కాంతిలో మానవ జీవితాన్ని, ముఖ్యంగా నా జీవితాన్ని చూస్తున్నాను.

******

# శ్రీ భగవాన్‌తో గ్రిద్దలూరి కుటుంబం అనుబంధం

(ఫిబ్రవరి సంచిక తరువాయి) శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తి

స్వామి రమణానంద సరస్వతి (పూర్వాశ్రమంలో వీరి నామధేయం శ్రీ టి.ఎన్. వెంకటరామన్, శ్రీ రమణాశ్రమం ప్రెసిడెంట్) రమణ కేంద్రం శంకుస్థాపనకు వచ్చినప్పుడు, మా ఆవిడను చూసి 'నువ్వేందే గ్యాసుస్టౌ అంటించి కుక్కరును పెట్టి అన్నం వండడానికి అవస్థ పడుతున్నావు బెజవాడ పిల్లా' అని ఆట పట్టించేవారు. 'మీ అత్తగారు బాగా చేసింది. ఏముంది నువ్వు చేసింది' అని చాలా సరదాగా మాట్లాడేవారు. మా ఆవిడ స్వామివారిని అడిగింది: ''మా మామగారు శరీరాన్ని వదిలి వేసినప్పుడు అక్కడే వున్నారా అని''. దానికి వారు 'నేను 1938 మార్చిలో వచ్చాను. మీ మామగారు 1939 ఫిబ్రవరిలో కాలం చేశారు. నాకు అంత పరిచయం లేదు కానీ, చివరి రోజులలో శ్వాస తీసుకోవటానికి ఇబ్బంది పడేవారు. అప్పుడు అన్నయ్యా! భగవాన్, అన్నయ్యా! భగవాన్ అని అంటూ వుండేవారు'. అది చూసేవాడిని అని చెప్పారు. వెంకట సుబ్బు (అంటే మా అమ్మగారు) నే నాకు బాగా తెలుసు అని చెప్పారు. మా అమ్మగారు పచ్చడి రుబ్బుతూ వుంటే భగవాన్ వచ్చి, సుబ్బూ అట్లా కాదు రుబ్బ వలసినది అని, ఆమె చేతి మీద చేయి పెట్టి మరీ రుబ్బి చూపించే వారట. ఉప్పు సరిపోయిందేమో చూడమని అడిగేవారట. అప్పట్లో పాత్రానికి పిడి ఉండేదికాదు. భగవాన్ స్పర్శ, భగవాన్ చేతి ప్రసాదం అందుకున్న మా అమ్మ ఎంతో ధన్యశాలి. వారి సంతానముగా

జన్మించడం, మరియు తరతరాలుగా భగవానుల ప్రసాదాన్ని ఇప్పటికీ అనేక రూపాలుగా పొందడం, మా పూర్వ జన్మ సుకృతం. జూన్ 20, 1989లో అరుణాచల నామ స్మరణతో, మా అమ్మగారు అరుణాచలేశ్వరునిలో ఐక్యమైనారు.

**పెద్దనాయన - సాంబశివరావు గారు**

మా నాన్నగారు కాలం చేసినప్పటి నుండి మా బాగోగులు చూసుకున్నది మా పెద్దనాయనగారు. వాళ్ళ పిల్లల కన్నా మమ్మల్ని ఎక్కువగా చూసుకున్నారు. ఆ తరువాతి కాలంలో ఎన్నోసార్లు మాతో, భగవాన్‌కి నేను మాటిచ్చాను అని చెపుతూ వుండేవారు. సాంబశివరావు గారు నెల్లూరు జిల్లాలో పెద్ద పేరున్న అడ్వకేట్. మా ఇద్దరక్కల పెళ్ళిళ్ళు, మా చెల్లెలి పెళ్లి, నా ఉపనయనం అయ్యే వరకు బ్రతికి వున్నారు.

పెరుమాళ్ స్వామి, రమణాశ్రమానికి సర్వాధికారిని తానే అని తీర్పు ఇవ్వవలసినదిగా కోర్టులో కేసు వేసినప్పుడు, సాంబశివరావు గారు ఆశ్రమానికి సంబంధించిన వీలునామా (1938) వ్రాయుట లోనూ, రిజిస్టర్ చేయుటలోనూ, ముఖ్యమైన వ్యక్తిగా వ్యవహరించారు. వారు, వీలునామాలో సంతకం చేయటానికి, శ్రీ భగవానుల అనుగ్రహం పొందిన పుణ్య పురుషుడు. జడ్జీలు వచ్చి భగవాన్‌ను ప్రశ్నించినప్పుడు, స్వయంగా శ్రీ భగవాన్ ఇలా అన్నారు...

"ఈ వీలునామా అమలుకి చిహ్నంగా గీత (---) గీసి, సంతకం పెట్టుట నా అలవాటు కాదు. కాబట్టి, నా బదులు గ్రిద్దలూరి

సాంబశివరావు దీనిలో నా ఎదురుగా సంతకం చేయుటకు అధికారం ఇచ్చుచున్నాను.''

అలా భగవాన్ తరపున వీలునామాలో సాక్షి సంతకం పెట్టినది సాంబశివరావు గారు. ఇలా గ్రిద్దలూరి వారి కుటుంబం మొత్తం భగవాన్ సేవకు అంకితమైనారు.

**నా తొలి దర్శనం:**

మా పెద్దనాయన గారు నన్ను (13 సం॥ వయసులో) 1949లో భగవాన్ దర్శనానికి తీసుకొని పోయారు. భగవాన్ దగ్గరికి నన్ను తీసుకొని వెళ్లి, సత్యనారాయణరావు కొడుకు అని చెపితే, తల ఊపారు భగవాన్. మాతృభూతేశ్వరాలయము నందు కుంభాభిషేకం, భగవాన్ రాతి సోఫాలో మొదటిసారి కూర్చోవటము జరిగినప్పుడు, నేను కూడా భగవాన్ వెనకాలే తిరుగుతూ ఉండేవాడిని. అప్పుడు భగవాన్ ఎదురుగా కూర్చున్నాను. భగవాన్ దృష్టి ఎవరిమీద పడుతుందో వాళ్ళు అదృష్టవంతులు.

**వెంకట రమణ:**

మా అన్నయ్య (పెద్దనాయన గారి కొడుకు) మేము పుట్టక మునుపు మా నాన్నగారితో రాయవెల్లూరులో ఉన్నాడు. ఒకరోజున తను స్నానం చేసి బకెట్ తీసుకొని వస్తూ వుంటే, మా ఇంటికి ఎదురుగా వున్న నేలబావిలో ఏదో తట్టుకొని పడిపోయాడు. ఆ సమయంలో మా నాన్నగారు పూజ చేసుకొంటూ ఉన్నారు. మా అన్నయ్య బావిలో పడ్డాడు అని తెలియగానే, చుట్టుప్రక్కల వాళ్ళను పిలవటానికి వెళ్ళారు మా నాన్నగారు. కానీ మా అన్నయ్యను

బావిలో ఎవరో క్రిందనుండి పట్టుకొన్నట్లు తనకు అనిపించిందట. చిన్న దెబ్బ మాత్రమే తగిలింది. ఎవరు పట్టుకొని వుంటారు? అనుకుని, ఇటువంటి విషయాలను గురించి చెప్పే వారిని ఒకరిని అడిగితే, వెంకటేశ్వర స్వామి తనని పట్టుకొన్నాడని చెప్పారు. అప్పటికి ఇంకా నాన్నగారికి భగవాన్ గురించి తెలియదు. అంటే అన్నయ్య మీద స్వామి అనుగ్రహం కూడా వున్నది.

మా అన్న 1975లో ఒకసారి హైదరాబాద్ వచ్చారు. ఒకరింట్లో వుండగా, ఒక రోజున ఉదయం లేవబోయి క్రింద పడటంతో బొమిక విరిగింది. దాంతో హాస్పిటల్‌కు తీసుకొని పోయి సర్జరీ చేయమని అడిగితే హాస్పిటల్ వారు తటపటాయించారు. ఎందుకంటె వారు వయస్సులో పెద్దవారు కనుక. సర్జరీని ముంబైలో చేయించమన్నారు. మా అన్న కూతురు, అల్లుడు ముంబైలో వుంటారు. వాళ్ళు వచ్చి ముంబైకి ట్రైన్‌లో తీసుకొనిపోతూ వుంటే మా అన్నయ్య అల్లుడికి హార్ట్ అటాక్ వచ్చింది. దాంతో మరుసటి స్టేషన్‌లో డాక్టర్‌ను పిలిపించి వైద్యం చేయించారు. తెల్లవార్లు ట్రైన్‌లో నిలబడే వున్నారు ఆయన. మరుసటి రోజు తెల్లవారు జామున మా అన్నయ్యను ఒక హాస్పిటల్‌కు, అల్లుడిని ఇంకొక హాస్పిటల్‌కు తరలించారు. మా అన్నయ్యకు సర్జరీ సక్సెస్‌ఫుల్‌గా జరిగింది కానీ, సర్జరీ జరిగిన సాయంత్రము నల్లటి రంగుతో వాంతులవటంతో డాక్టర్లు ఇంకా 48 గంటలే బ్రతికే అవకాశం వున్నది అని చెప్పారు. మా అన్నయ్య పరిస్థితి ఎలా ఉన్నదంటే, తాను చైతన్యంలోనే వున్నాడు, కానీ శరీరం సహకరించటం లేదు.

దాంతో నన్ను అక్కడకు రమ్మనమని అంటే నేను వెళ్లాను. నేను మా అన్నయ్యకు ఆఖరు క్షణాలలో అరుణాచలం గురించే ఆలోచించు అని చెప్పాను. అప్పుడు తను కంటితో సైగలు చేస్తూ, నేను అందులోనే వున్నాను అని చెప్పారు. 48 గంటలు మాత్రమే బ్రతికే అవకాశమున్నది అని డాక్టర్లు చెప్పినా, తను ఇంకొక నాలుగు రోజులు బ్రతికే వున్నాడు. ఇక ఏడవ రోజు మధ్య రాత్రి 2.30 గంటలకు తనకు శ్వాస తీసుకోవటం ఇబ్బందైనది. అప్పుడు హెడ్‌నర్సు వచ్చి చూసి, ఏమీ ఫరవాలేదు అని చెప్పినా, నాకు, లోపల, అన్నయ్య శరీరం వదిలే సమయం వచ్చిందని అనిపించి, అన్నయ్య చెవి దగ్గర కూర్చొని, అరుణాచలశివ నామము 15 నిమిషములు జపించాను. ఆ తరువాత అన్నయ్య ప్రశాంతంగా ప్రాణాన్ని వదిలివేశాడు.

**భగవాన్‌తో జ్ఞాపకాలు:**

1982లో నేను రమణాశ్రమానికి వెళ్ళినప్పుడు, భగవాన్ సమాధికి ప్రదక్షిణ చేస్తూ వుంటే, లోకమ్మ గారనే భగవాన్ సేవకురాలు నన్ను పిలిచి, నువ్వు రుక్మిణి తమ్ముడివి కదా! అని అన్నది. అవునమ్మా అని అనటంతో, నీకు తెలియని విషయాలు ఇప్పుడు చెప్పాలని నిన్ను పిలిచాను అని అన్నది. మీ నాన్నగారు మంచానికే పరిమితమైనప్పుడు, మీ అమ్మ నిన్ను ప్రొద్దున్నే 7 గంటలకు తీసుకొని వచ్చి భగవాన్ దగ్గర వదిలిపెట్టి పోయేది. నువ్వు భగవాన్ ఒడిలో కూర్చునేవాడివి. కమండలంలో నీళ్ళు

త్రాగేవాడివి. ఇవన్నీ నీకు తెలియవు. అందుకని నీకు చెపుతున్నాను అన్నది.

**భగవాన్ మార్గం ద్వారా యోగ మార్గములోకి ప్రవేశం:**

మాకు నెల్లూరు జిల్లాలో మైకా మైన్స్ ఉండేవి. ఆ మైన్స్‌కు ఎక్కువగా నేను పోయేవాడిని. ఆ మైన్స్‌కు ఒక మేనేజరు కావాలని ప్రకటన ఇస్తే, ఆర్.ఆర్. నాయుడు గారని ఒకరొచ్చారు. నాకప్పుడు కడుపులో విపరీతమైన నొప్పి వస్తూ వుండేది. అది చూసి నాయుడు గారు, సార్, మా ఆవిడకు జాబు వ్రాస్తే మీ నొప్పి తగ్గుతుంది అనేవారు: అలా వినటం నాకు క్రొత్తగా వున్నది. ఎప్పుడూ, ఎక్కడా అలా జాబు వ్రాస్తే నొప్పి తగ్గుతుంది అని వినలేదు. కానీ ఆయన జాబు వ్రాస్తే నొప్పి తగ్గేది. మళ్ళీ నొప్పి వచ్చేది. మళ్ళీ జాబు వ్రాస్తే ఆ నొప్పి తగ్గేది. కొంతకాలం తరువాత వాళ్లకు క్వార్టర్స్ ఇచ్చాము. నాయుడిగారి భార్య పేరు చంద్రకాంతమ్మ. ఆ మహా ఇల్లాలు, ఉదయం 7 గంటలకు, సాయంత్రం 6 గంటలకు ప్రార్థనకు కూర్చునేది. నన్ను రమ్మనమని నాయుడిగారిచేత లేదా ఇతర పనివారితోటి పిలిపించేది. కానీ నేను పోయేవాడిని కాదు. భగవాన్‌ను మించిన వారెవరుంటారు అనేది నా అభిప్రాయం. ఆఖరికి ఆవిడే వచ్చేది. రా నాయనా నాతోపాటు వచ్చి ప్రార్థనలో కూర్చో అనేది. ఆవిడ బాధ పడలేక వెళ్ళేవాడిని. ప్రార్థన గురించి నాకేమీ చెప్పలేదు ఆవిడ. తల్లి పిల్లవాడికి ఎలా బుజ్జగించి అన్నం పెడుతుందో, అలా నన్ను బుజ్జగించి మరీ ప్రార్థనకు కూర్చో పెట్టేది. ఆవిడ ప్రార్థనకు కూర్చున్నదంటే గంట వరకూ లేచేది కాదు. ఒకటి,

రెండు రోజులు చూసిన తరువాత, ఆవిడ కళ్ళు మూసుకోగానే నేను లేచి వచ్చేసేవాడిని. 10 రోజులు చూసిన తరువాత నాతో ఆవిడ, 'నేను లేచేవరకూ నువ్వు లేవకూడదు' అని అన్నది. మరల 10 రోజుల తరువాత, నాయనా నీకు ప్రార్థన జరుగుతున్నదా అని అడిగింది. నేనప్పుడు ఆవిడతో ఇలా అన్నాను: "అమ్మా! మీరు అనేటటువంటి ప్రార్థన ఏమిటో నాకు తెలియదు. నాకేమీ చెప్ప లేదు. నేను కూర్చున్న గంట సేపూ అటూ, ఇటూ వచ్చి పోయే వాళ్ళను చూస్తూ వున్నాను. మీరేమో కళ్ళు మూసుకొని కూర్చున్నారు" అని అన్నాను. అప్పుడు ఆ మహా ఇల్లాలు 'ఈ పిల్లవాడికి స్వయం ప్రకాశం కలగాలని ప్రార్థన చేసింది'. ఎప్పుడైతే ఈ ప్రార్థన చేసిందో అప్పుడు నాకు ఆ లింకు అందుకొన్నది. ఇంక అప్పటినుండి ఆవిడ ఎక్కడ వుంటే అక్కడకు వెళ్ళేవాడిని. కేవలము నన్ను ఆ మార్గంలో ప్రవేశపెట్టటమే కాదు, నన్ను ఆ ప్రార్థనను అనుసరించేట్లుగా చేసింది ఆ మహా ఇల్లాలు. అలా నాలో గొప్ప పునాదిని ఏర్పాటు చేసింది. ఆవిడ ఎవరూ అంటే, వేటూరి ప్రభాకర శాస్త్రి గారి శిష్యురాలు. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు మాస్టర్ సి.వి.వి. గారి శిష్యులు. నేను 1962లో కుంభకోణంలో వున్న మాస్టర్ సి.వి.వి. గారింటికి వెళ్లాను. 40 రోజులు మాస్టర్ గారింట్లో వున్నాను. వారింటి ప్రక్కనే కావేరీనది వున్నది. ప్రొద్దునే వెళ్లి నదిలో స్నానం చేయటము, వారింటికి వచ్చి ప్రార్థన చేయటమూ చేసేవాడిని. మాస్టర్ గారి కూతురు మంజులమ్మగారు అప్పుడు అక్కడే వున్నారు. అక్కడికి దగ్గరలోనే మాస్టర్‌గారు స్థాపించిన యోగా సెంటరు వున్నది.

(సశేషం)

# *Vyadha Gita:* The Song of the Butcher

Dr K Subrahmanian

A person went to Sri Ramakrishna and said, “I don’t want to do business anymore.” Sri Ramakrishna asked, “Why do you think of yourself of being just a businessman? You’re more than that! Why do you think that being a businessman is bad? It is something that you have to do. It is your job. How can the world exist without businessmen? There must be somebody to sell things. You need to remember that you play an important role in our everyday life. As a businessman, you must remember, when customers come to you, you must be kind to them. As they leave, they must feel happy that they came to your shop. The public does not expect a businessman to sell things at cost price; people know that you have to make some profit – otherwise, you and the members of your family won’t be able to live comfortably. But don’t exploit people; be reasonable, and when the customer leaves satisfied, be happy that you have done your duty. You have a job to perform, and this job has been given to you by the Lord himself. Accept it, and do it to the best of your ability. All jobs are the same; you must have the attitude that no job is better than the other. To have this kind of attitude, however, you must have the grace of the Lord.”

Sometimes, we feel that we should do some new business so that we can earn more money. However, after

a while, we realise that having more money has its own set of problems. Within a few months, we are no longer interested in being a businessman; we want to be something else. We decide to become a teacher because we've been told that teaching is a noble profession. After being in the classroom for a few months, however, we get bored – we want to do something else. It goes on and on. No one is happy with what they are doing; but there is no escape for any of us from this routine task. We need to do something or the other as long as we are alive. We are restless because we are not willing to believe in the will of God. We should feel that we must do whatever it is that has been assigned to us to the best of our ability. This is *swadharma.* There is nothing great about any particular job; how we look at anything depends on our attitude. If a person does his job to the best of his ability, offering the fruits of the action to the Lord, whatever the nature of the action, will purify them. The teacher spreads knowledge; if however, he dilutes the content in order to become popular with the students, then he's not doing his job to the best of his ability. All of us, irrespective of what it is we do, need to be sincere in our work.

